# నమస్తే తెలంగాణ
## జోగులాంబ గద్వాల వనపర్తి
5 మహబూబ్‌నగర్, మంగళవారం 14 జనవరి 2025 JOGULAMBA GADWAL WANAPARTHY




మాజీ ఎంపీ మంద భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న కేటీఆర్

## మాజీ ఎంపీకి కేటీఆర్ నివాళి

- **మంద జగన్నాథం కుటుంబ సభ్యులను ఓదార్చిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీ రావుల**

అలంపుర్/మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, జనవరి 13: కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ మాజీ ఎంపీ మంద జగన్నాథం ఆదివారం రాత్రి హైదరాబాద్ నిమ్స్ దవాఖానలో తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం మంద జగన్నాథం భౌతిక కాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ ఓ మంచి నికార్సైన సీనియర్ నేతను కోల్పోయిందని



మంద కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

విచారం వ్యక్తం చేశారు. వివాద రహితుడు, సౌమ్యుడు, తెలంగాణ మేలు కోరిన వ్యక్తిగా ఉమ్మడి పాలమూరులో రాజకీయంగా మంద తమదైన చెరగని ముద్ర వేశారన్నారు. సమాజానికి మంద అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అలాగే మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మంద పార్థివదేహానికి పూల మాల వేసి నివాళులర్పించి బాధిత కుటంబ సభ్యులను పరామర్శించారు. కాగా మంద జగన్నాథం అంత్యక్రియలు సైదాబాద్ మహాప్రస్థానంలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. అలంపూర్ నియోజకవర్గ తెలంగాణ ఉద్యమ నాయకులు ,మంద జగన్నాథం అభిమాన నాయకులు వడ్డేపల్లి శ్రీనివాసులు, పటేల్ విష్ణువర్ధన్‌రెడ్డి, కుర్వ పల్లయ్య, మహేశ్‌గౌడు, ఇస్మాయిల్, రాములు, బీచుపల్లి, దుబ్బన్న, తుమ్మల రవికుమార్, ధర్మరాజు, ఊట్కూరు నర్సన్‌గౌడ్, అమరవాయి రోషన్న, పుల్లూరు ఏకాంత్, వల్లూరు గిడ్డారెడ్డి, రాంరెడ్డి, వల్లూరు కిశోర్, గార్లపాడు భూషణం తదితరులు మంద అకాల మరణంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

### మందకు మాజీ ఎంపీ రావుల నివాళి

వనపర్తి టౌన్, జనవరి 13 : నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మంద జగన్నాథం మృతిచెందడంతో సోమవారం మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఆయన స్వగృహానికి వెళ్లి పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంద జగన్నాథం సతీమణి, తమ్ముడు మంద వెంకటేశ్ కుమార్, కుమారుడు మంద శ్రీనాథ్‌లను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ రావుల

## టూరిజం హబ్‌గా నల్లమల



అక్కమహాదేవి గుహలకు వెళ్లేందుకు బోటులో వెళ్తున్న సందర్శకులు

- **అక్కమహాదేవి గుహలకు సఫారీ యాత్ర చారిత్రాత్మకం**
- **అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, డీఎఫ్‌వో రోహిత్ గోపిడి**

అచ్చంపేట, జనవరి 13 : నల్లమల అటవీ ప్రాంతం మరో టూరిజం హబ్‌గా ఏర్పాటు కాబోతుందని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, డీఎఫ్‌వో రోహిత్ గోపిడి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా దోమల పెంట వద్ద నల్లమలలోని అక్కమహాదేవి గుహలకు వెళ్లడానికి సఫారీ యాత్రను సోమవారం వారు ప్రారంభించారు. అనంతరం అక్కడి నుంచి అటవీశాఖ బోట్‌లో కృష్ణానది గుండా అక్కమహాదేవీ గుహలకు చేరుకొని గుహలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ టూరిజం, అటవీ, దేవాదాయ శాఖలు సంయుక్తంగా నల్లమల ప్రాంతంలో చారిత్రాత్మకమైన 18 స్థలాలను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. అక్కమహాదేవి గుహలను సందర్శించేందుకు సఫారీ యాత్ర కోసం సందర్శకులు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అటవీ, టూరిజం శాఖాధికారులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థిని

మక్తల్, జనవరి 13: జాతీయస్థాయి సీనియర్ మహిళా షూటింగ్ బాల్ పోటీలకు మేఘవర్ష ఎంపికైనట్లు సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ, వ్యాయామ కోచ్ గోపాలం సోమవారం ప్రకటనలో తెలిపారు.తెలంగాణ జట్టు తరఫున మేఘావర్ష ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు ఒడిస్సాలో జరిగే జాతీయస్థాయి సీనియర్ షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

## పండుగ పూట విషాదం

- **పతంగి ఎగరేస్తూ బాలుడు మృతి**

మహ్మదాబాద్ జనవరి 13 : పండుగ పూట సరదాగా పతంగి ఎగరేస్తూ బాలుడు మృతిచెందిన ఘటన మహ్మదాబాద్ మండలంలోని కంచన్‌పల్లిలో చోటు చేసుకున్నది. ఎస్సై శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం గ్రామానికి చెందిన రఘు కుమారుడు మనోజ్‌కుమార్(7) సోమవారం వారి ఇంటి పక్కనే ఉండే వారి డాబా పైకి ఎక్కి పతంగి ఎగరేస్తున్నాడు. ఈ క్రమంలో గాలిపటం పక్కనే ఉన్న విద్యుత్ వైర్లకు తట్టుకోగా దానిని వైర్ల నుంచి తీయడానికి ఇనుప రాడ్డుతో ప్రయత్నించాడు. దీంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆ సమయంలో ఆ ఇంటి యాజమాని సత్తయ్య మనువడు లక్కీ కూడా షాక్ గురికావడంతో ఇద్దరు అక్కడే పడిపోయారు. వీరిని గమనించిన ఇంటి యాజమాని మహబుబ్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మనోజ్‌కుమార్ మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. లక్కీకి గాయాలయ్యాయని చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. మనోజు తండ్రి రఘు ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొన్నటు ఎస్సై తెలిపారు.










- నేడు మకర పండుగ..
- రేపు కనుమ..
- జరుపుకొనేందుకు సిద్ధమైన ఉమ్మడి పాలమూరు జిల్లా

- ఘనంగా ముగిసిన భోగి
- అలరించిన రంగవల్లులు, గొబ్బెమ్మలు
- ఊరూరా డూడూ బసవన్నల సందడి

# సంక్రాంతి వచ్చిందోచ్..



నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, జనవరి 13 : సంక్రాంతి వచ్చింది.. సంబురాలు తెచ్చింది.. మంగళవారం పండుగను జరుపుకొనేందుకు ఉమ్మడి పాలమూరు జిల్లావాసులు సిద్ధమయ్యారు. తెలుగు సంస్కృతీ సంప్రదాయాల్లో ఈ పండుగకు విశిష్ట స్థానం ఉంది. కొత్త పంటలను ఇంటికి తీసుకొస్తూ కొంగొత్త ఆనందాలను ఇంటిల్లిపాదికి అందిస్తూ భోగ భాగ్యాలు కల్పిస్తూ విరాజిల్లుతుంది. పిండి వంటలు పండుగకు ప్రత్యేక శోభ తీసుకొస్తాయి. పిల్లలు పతంగులు ఎగురవేస్తూ కేరింతలు కొట్టిస్తుంది. భోగితో మొదలై కనుమతో పండుగ ముగుస్తుంది. కొత్త కోడళ్లతో, అల్లుళ్లు, ఆడపడుచులతో పల్లెలు సందడిగా మారాయి.

### మకర సంక్రాంతి..

నక్షత్రాలన్నింటినీ కలిపి 108 పాదాలుగా.. 108 పాదాలను 12 రాశులుగా విభజించారు. ఈ నెలలో సూర్యుడు ధనురాశి నుంచి మకర రాశిలో ప్రవేశిస్తాడు.. అందుకే మకర సంక్రాంతి అంటారు. తెలంగాణ ప్రాంతంలో నువ్వులు, బెల్లం, కలిసి లడ్డులు, నువ్వుల రొట్టెలు, చెగోడిలు, చకినాలు వంటి వంటలు తయారు చేస్తారు. అలాగే కూరగాయాలన్నింటినీ వాయనంగా సమర్పించుకుంటారు. మకర సంక్రమణం రోజు నువ్వుల నూనెలో మహాలక్ష్మి కొలువై ఉంటుందని ప్రతీతి. తలకు నూనెను రాసుకుని శనగ పిండితో స్నానం చేస్తే సకల భాగ్యాలు కలుగుతాయన్నది విశ్వాసం.

### గొబ్బెమ్మలు..

ఆవు పేడతో పిడికిలి పరిమాణంలో గోపురం ఆకారంలో చేసి వాటి మధ్యలో గరిక రెమ్మలు చెక్కి చుట్టూ పసుపు, కుంకుమలతో అలంకరిస్తారు. వాకిళ్లలోని ముగ్గుల మధ్యన గడప గడపకు రెండు వైపులా జతలు జతలుగా పెడుతారు. వాటి చుట్టూ చిక్కుడకాయలు రేగు పండ్లు, నవ ధ్యానాలు, బంతి పూలు పోశారు. రంగురంగుల ముగ్గులు సైతం అలరించాయి. భోగి రోజు భోగి కుండలు, పాల కుండల ముగ్గులు వేశారు. సంక్రాంతి రోజు రథం ఇంటి లోపలికి ఇచ్చినట్లు వేసే ముగ్గులు, కనుమ రోజు రథం బయటికి వెళ్తున్నట్లు రంగవల్లులు వేస్తారు. చివరి రోజున రథం ముగ్గు వేస్తారు.

### డూడూ బసవన్నల సందడి

రావమ్మా మహాలక్ష్మీ.. రావమ్మా.. అంటూ హరి దాసుల సంకీర్తనలు, పిల్లాపాపలు సల్లంగుండాలని డూడూ బసవన్నలు దీవించే దృశ్యాలు కనిపిస్తున్నాయి. బసవన్న అమ్మవారికి దండం పెట్టూ ఈ ఇంటికి మేలు జరుగుతుందని చెప్పు మంచి జరుగుతుందని చెప్పు అంటూ గంగిరెద్దుల తలలను ఊపిస్తూ గంగిరెద్దుల కులస్తులు కనింపిస్తున్నారు. సూర్యోదయం కంటే పండుగ రోజులు ముందే లేచి రకరకాల బట్టలతో గంగిరెద్దులను అలంకరించుకుని వాయిద్యాలతో ప్రదర్శనకు వస్తారు. సన్నాయి, బూర, డోలు, చేతిలో కంచుతో చేసిన చిన్న చేగంట, నెత్తిన రంగుల తలగుడ్డ, చెవికి కమ్మల జోడు, భుజాల మీద కండువాలు, గంగిరెద్దులకు ఇచ్చిన శిక్షణ వారి ఆటపాటల్లో స్పష్టంగా కనిపిస్తున్నది.



పాలమూరులో..

### పిండి వంటలు

సంక్రాంతి పండుగ సమయంలో బియ్యం పిండితో అరిసెలు చేసుకోవడం ఆనవాయితి. మిగిలిన పిండితో చిన్నగా చిక్కుడు గింజల మాదిరిగా చేసి భోగి రోజున చిన్న పిల్లలకు దిష్టి తీసేందుకు ఉపయోగిస్తారు. ఉదయమే స్నానమాచరించి కొత్త బట్టలు ధరిస్తారు.

### కనుమ..

సంక్రాంతి మరుసటి రోజున.. బుధవారం నిర్వహించే పండుగను కనుమ. నోములు నోముకున్న వారు తమ చుట్టు పక్కల ఉన్న ముత్తైదులను పిలిచి నోము వస్తువులను వారికి వాయినంగా ఇస్తారు. పొలాలు దున్నే ఎద్దులకు కృతజ్ఞతలు తెలిపే విధంగా చేయడం ఆనవాయితీ.

### ఘనంగా భోగి

సంక్రాంతికి ముందు రోజు భోగిని సోమవారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ రోజు సూర్యుడు ధనుష్ రాశిలోంచి మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. స్వర్గలోకపు వాకిళ్లు తెరుస్తారని నమ్మకం ఉన్నది. తెల్లవారుజామునే భోగి మంటలు వేశారు. సజ్జ, నువ్వుల రొట్టెలు ప్రత్యేకం. తీపి వంటకాలతో పాటు ప్రత్యేకంగా వీటిని ఆరగించారు. చిక్కుడు కూరతో రొట్టెలను కలిపి తింటే ఆ రుచే వేరు.

### మొదలైన సందడి

సంక్రాంతితో పల్లెల్లో సందడి మొదలైంది. బతుకు దెరువు కోసం దూరప్రాంతాలకు వెళ్లిన కూలీలు సైతం సొంతూళ్లకు చేరుకున్నారు. బంధువుల, ఆత్మీయుల పలకరింపులతో ఇండ్లన్నీ కళకళలాడుతున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు పండుగకు సర్వం సిద్ధం చేసుకున్నారు. నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. రంగు రంగుల ముగ్గులతో వాకిళ్లు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి.

## ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు చేరని నీళ్లు



నీళ్లు అందకపోవడంతో ఆర్డీఎస్ ప్రధాన కాల్వలో అడుగంటిన నీళ్లు

అయిజ, జనవరి 13 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టలో నీటి నిల్వ తగ్గుతుండటంతో ఆర్డీఎస్ ప్రధాన కాల్వలో నీటి పారుదల నిలిచి పోయింది. ఈనెల 8న ఆర్డీఎస్ ఇండెంట్‌లో భాగంగా టీబీ డ్యాం నుంచి నీటిని విడుదల చేసినప్పటికీ సోమవారం వరకు నీరు చేరలేదు. ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు నీటి చేరికకు అవసరమైన వరద హెడ్‌రెగ్యులేటర్ల ద్వారా విడుదల కావడంలేదు. దీంతో ఆర్డీఎస్ ఆనకట్టలో నీటిమట్టం తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శని, ఆదివారాల్లోనే ఆనకట్టకు ఇండెంట్ నీరు చేరాల్సి ఉన్నప్పటికీ ఎగువన ఉన్న కర్ణాటక ఎత్తి పోతల పథకాలు, రైతుల మోటార్ల ద్వారా వచ్చిన నీటిని వచ్చినట్లే తోడేస్తుండటంతో ఆనకట్టకు చేరుకోవడంలో ఆలస్యమవుతోందని రైతులు భావిస్తున్నారు. ఇప్పటికే ఆర్డీఎస్ ఆయకట్టులో సాగు చేసిన పంటలకు నీటి పారుదల లేక పోవడంతో పంటలు ఎండిపోయే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం ప్రధాన కాల్వకు 85 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా, కర్ణాటకలోనే ఇంకిపోతున్నాయి. 58 క్యూసెక్కులు ఆర్డీఎస్ కన్‌స్ట్రక్షన్ స్లూయిస్ గుండా దిగువకు ప్రవహిస్తుంది. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 4.8అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆర్డీఎస్ ఆనకట్టలో నీటి నిల్వ పూర్తిగా పడిపోతున్నాయని, టీబీ డ్యాం నుంచి నీటి చేరిక మొదలైతేనే ప్రధాన కాల్వకు నీటి విడుదల పెంచుతామని ఆయన పేర్కొన్నారు.

### టీబీ డ్యాంలో..

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో నిలిచిపోగా, అవుట్‌ఫ్లో 10,198 క్యూసెక్కులు ఉంది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 71.202 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1633 అడుగుల పూర్తి స్థాయి నీటిమట్టానికి గానూ ప్రస్తుతం 1623.34 అడుగులు ఉన్నట్లు టీబీ బోర్డు సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

## సెమీస్‌కు చేరిన తెలంగాణ



పోటీపడుతున్న తెలంగాణ, గుజరాత్ బాలుర జట్లు

- **కొనసాగుతున్న హ్యాండ్‌బాల్ పోటీలు**

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 13 : జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో జరుగుతున్న 68వ జాతీయస్థాయి అండర్-17హ్యాండ్‌బాల్ పోటీలో తెలంగాణ బాలుర జట్టు సెమీ ఫైనల్‌కు చేరింది. మ్యాచ్ ప్రారంభానికి డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ ఇజాజుద్దీన్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదా బాయి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రజినీకాంత్‌రెడ్డి, కార్యదర్శి జియావుద్దీన్, రవికుమార్, ఆసీఫ్, ప్రదీప్‌కుమార్, ఫారుఖ్‌ముక్రం, ఇలియాజ్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు.

### క్వార్టర్‌లో పోటీపడిన బాలుర జట్లు

తెలంగాణ జట్టు 16-09తేడాతో హర్యానాపై విజయం సాధించింది. రాజస్థాన్ 17-03 తేడాతో వెస్ట్ బెంగాల్‌పై, ఉత్తర ప్రదేశ్ 20-17తేడాతో కేరళపై, ఆంధ్రప్రదేశ్ 18- 11తేడాతో పంజాబ్‌పై విజయం సాధించి సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

### ప్రీ క్వార్టర్స్ బాలికల విభాగంలో..

తెలంగాణ జట్టు 11-06 తేడాతో పంజాబ్‌పై విజయం సాధించగా.. హర్యానా 20-12తేడాతో మహారాష్ట్రపై, ఉత్తర ప్రదేశ్ 14-05 వెస్ట్ బెంగాల్‌పై, కేరళ 12-09 కర్ణాటకపై, రాజస్థాన్ 06-03 బీహార్‌పై, తమిళనాడు 18-07 మధ్య ప్రదేశ్‌పై, గుజరాత్ 16-06 చండీఘర్‌పై, హిమాచల్‌ప్రదేశ్ 13-07ఒడిశాపై విజయం సాధించి క్వార్టర్‌కు చేరాయి.




















